కమనీయం శ్రీనివాసుని కల్యాణం



సామూహిక కుంకుమార్చనలో మహిళలు



- ఘనంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు
- సామూహిక కుంకుమార్చన
- నిత్యహోమాల్లో ఉభయదాతలు
- స్వామివారికి ప్రత్యేక పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. చిట్టినగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజు నిత్య హోమాలు, సామూహిక కుంకుమార్చన, ఎదుర్కోలు ఉత్సవం, స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఉభయదాతలు, భక్తులతో నిత్యహోమాలు చేశారు. ఆలయ అర్చకులు ఉభయదాతలతో హోమాలు జరిపించారు. అనంతరం స్వామివారి ఆస్థాన కల్యాణ మండపంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించగా, పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పెళ్లి కుమారుడు, పెళ్లికుమార్తెలుగా ముస్తాబైన శ్రీ పద్మావతి, గోదాదేవి, శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి భక్తులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



వెంకన్న సన్నిధిలో వెలంపల్లి శ్రీనివాసరావు



స్వామి వారికి విశేష అలంకరణ

స్వామివారి సన్నిధిలో..

మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆదివారం శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వెలంపల్లి శ్రీనివాసరావును ఆలయ కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. ఇరు దేవేరులతో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.



నిత్య హోమాల్లో ఉభయదాతలు

వైభవంగా కల్యాణం

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవాన్ని వీక్షించడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలను దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కమిటీ కార్యవర్గం, సభ్యులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

నేడు వీఎంసీ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదులు-పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుందని, నగరపాలక సంస్థ ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో కూడా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: నా నేస్తం మ్యూజికల్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో తొలి కార్యక్రమంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన స్వర సినీ సంగీత విభావరి సీజన్-1 అలరించింది. నగరానికి చెందిన గాయనీ గాయకులు నాగభూషణం, నాయక్, నాగలక్ష్మి, షబానా, శ్రీను, బ్రహ్మం వెంకటేశ్వరరావు తదితరులు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు. సంస్థ అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు.

ఎమ్మెల్యే బొండాను కలిసిన జిల్లా ఎన్జీవో సంఘం నేతలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావును ఆదివారం ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో సంఘం నేతలు ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమాను ఎన్జీవో సంఘం సత్కరించింది. ఎమ్మెల్యే బొండా ఉమాను కలిసిన వారిలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, జిల్లా నగర కార్యవర్గ సభ్యులు పీ రమేష్, డీ విశ్వనాథ్, సీవీఆర్ ప్రసాద్, నజీరుద్దీన్, పీ రాజశేఖర్, కే మధుసూదన్ రావు, శ్రీనివాస రావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిరాం, మాజీ నాయకులు సత్యనారాయణరెడ్డి, నాగార్జున తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ తోటివారికి సాయం చేయడం అలవాటుగా చేసుకోవాలని వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. తమ వంతు బాధ్యతగా విద్యాభివృద్ధికి ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. తమ కుమారుడి విద్యకు ఆర్థిక సాయం అందజేసిన ట్రస్ట్‌కు దాసరి అనురాధ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీ పీ లక్ష్మీ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్



విజయవాడరూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు జరిగిన గ్రామాల్లో ఆదివారం సోషల్ ఆడిట్ జరిగింది. నున్న, పాతపాడు, జక్కంపూడి, గొల్లపూడి, ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల్లో స్టేట్ రిసోర్స్ పర్సన్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్, విలేజ్ రిసోర్స్ పర్సన్లు గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారు. నున్న గ్రామంలోని జగనన్న కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇంటి నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు జాతీయ ఉపాధి పథకం కింద మంజూరైన గ్రాంట్‌కు సరిపడు చెల్లింపుల విషయంలో సోషల్ ఆడిట్ సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మిగిలిన గ్రామాల్లో బిల్లు చెల్లింపులపై ఆడిట్ సిబ్బంది ఆరా తీశారు.

నిరుపేద చిన్నారులకు నిత్యావసరాల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): అనాథ, నిరుపేద చిన్నారులకు ఆదివారం హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు కోరంగి నాగమల్లీశ్వరి, షఫీ మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా నిరుపేద చిన్నారులకు దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ వసంత కుమార్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా నిరుపేద, అనాథ చిన్నారులకు ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

రేపు సంకటహర చతుర్థి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం మారుతీ వ్యాయామశాల సమీపంలోని శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో మంగళవారం సంకటహర చతుర్థి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కొమండూరి రఘురామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం స్వామివారికి విశేషంగా పంచామృతాలతో అభిషేకం, సహస్ర నామార్చన పూజలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

వర్షానికి నగరంలోని రోడ్లు జలమయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షానికి దేవీనగర్ రైల్వేట్రాక్, రామకృష్ణాపురం ఆర్‌యూబీ వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. అలాగే లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

కూలిన చెట్ల కొమ్మలు..

నిత్యం రద్దీగా ఉండే దేవీనగర్ మెయిన్ రోడ్డులో వర్షానికి చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఒక్కసారిగా చెట్టు కొమ్మలు రోడ్డుపై పడటంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. చెట్టు కొమ్మలను స్థానికులు తొలగించారు.

భారీ వర్షంతో పొంగిన డ్రెయినేజీ కాల్వలు

పాయకాపురం(విజయవాడరూరల్): భారీ వర్షంతో 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లోని పలు రోడ్లు జలమయమయ్యాయి. వంగవీటి మోహన్‌రంగా కాపు కమ్యూనిటీ హాలు వెనుక నాలుగు బజార్లలో వర్షం నీటితో డ్రైనేజీ కాల్వలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. ఎప్పుడు వర్షాలు కురిసినా డ్రైనేజీ కాల్వలు పొంగి పొర్లడంతో నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. పాలకులు పట్టించుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు.



దేవీనగర్‌లో విరిగిపడిన చెట్టు కొమ్మలు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



చిన్నారుల సంప్రదాయ వస్త్ర ప్రదర్శన

విజయవాడకల్చరల్: మురళీమోహన్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముద్రా నృత్య కళాకేంద్రం బాలికలు కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. భో శివశంభో, ఆదివో అల్లదివో తదితర కీర్తనలకు నృత్యాలను అభినయించారు. అలాగే చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. మురళీమోహన్ కల్చరల్ ఆర్ట్స్ నిర్వాహకులు శేఖర్, మురళీ మోహన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు



నగరంలో భారీ వర్షం

నగరంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై కనిపించింది. వాన కురవడంతో వీధులు జలమయమయ్యాయి. పలుచోట్ల నీరు నిలవడం, డ్రైయినేజీ నీరు కలవడంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడ్డారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



750 మందికి ఉచిత వైద్య పరీక్షలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): పాయకాపురం విశాలాంధ్రకాలనీలోని ఎస్‌జీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం జరిగిన వైద్య శిబిరంలో 750 మంది వైద్య పరీక్షలు చేశారు. సింగ్‌నగర్ ఫ్యామిలీ ఆస్పత్రి ఫిజీషియన్ డాక్టర్ సైరాభాను, వన్‌టౌన్‌లోని అయాన్ ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ బషీర్ అహ్మద్ మయూక్ వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సైరాబాను.. వైద్య బృందం సాధారణ వ్యాధులు, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి వ్యాధులు ఉన్న వారికి 426 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. పలువురికి 25 రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్ బషీర్ అహ్మద్ 320 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఐ డ్రాప్స్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సైరాభాను దోమకాటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్‌కుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ ఉప్పరపల్లి లక్ష్మీ రాజ్యపూర్ణ, అయాన్, ఫ్యామిలీ ఆస్పత్రిల గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే

నున్న(విజయవాడరూరల్): ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఇంటింటా సర్వే నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆదేశాలు జారీ చేశారు. అనుమానిత డయేరియా, మలేరియా, డెంగీ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. వైద్య పరీక్షల ఫలితాల ఆధారంగా వెంటనే వారికి చికిత్సను అందించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. వ్యాధులు నిర్ధారణ అయితే వారికి వెంటనే వైద్యసేవలందించి, ఇతరులకు వ్యాధి వ్యాప్తి చెందకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలంలో ఇంటింటి సర్వే నిరంతరం నిర్వహించాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు అందాయి.

సిటీ బస్సులు పునరుద్ధరించరూ..

- నిరుపయోగంగా మారిన సిటీ బస్టాప్
- ఆటోలపై ఆధార పడుతున్న ప్రయాణీకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ నిర్మాణ పనుల్లో భాగంగా నిలిపివేసిన సిటీ బస్సులను పునరుద్ధరించాలని ప్రయాణీకులు కోరుతున్నారు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు అధికంగా నివసించే దేవీనగర్, గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, మధురానగర్, గులాబీతోట, భానునగర్ తదితర ప్రాంత వాసులు సిటీ బస్సులు లేక అధిక చార్జీలు చెల్లించి ఆటోల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు వారు. సంపాదించిన దాంట్లో అధిక భాగం ఇంటి అద్దెలు, ప్రయాణ చార్జీలకే సరిపోతున్నాయని వాపోతున్నారు. గతంలో 14ఈ సిటీ సర్వీసు రాయనపాడు నుంచి దేవీనగర్ వరకు వయా కాశేశ్వరరావు మార్కెట్, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, అలంకార్ టాకీస్, డీ మార్ట్, సాంబమూర్తి రోడ్డు, అల్లూరి సీతారామరాజు వంతెన, మధురానగర్ మీదుగా దేవీనగర్ వరకు వచ్చి తిరిగి అదే మార్గంలో తిరిగి వెళ్లేది. అయితే మధురానగర్ ఆర్‌యూబీ పనులు ప్రారంభం కావడంతో పాటు కోవిడ్ మహమ్మారి సమయంలో ఈ సర్వీసును నిలిపివేశారు. ఇప్పుడు ఆర్‌యూబీ పనులు పూర్తయినప్పటికీ ఈ సిటీ సర్వీసు మాత్రం పునరుద్ధరణ చేయలేదు. అలాగే 20ఏ సిటీ సర్వీసు దావు బుచ్చయ్యకాలనీ నుంచి దేవీనగర్, మధురానగర్, గులాబీతోట, సాంబమూర్తి రోడ్డు, కొత్త వంతెన, డీ మార్ట్, అలంకార్ టాకీస్, రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ వారధి మీదుగా మంగళగిరి ఎయిమ్స్‌కు చేరుకునేది. తిరిగి అదేమార్గంలో దావు బుచ్చయ్యకాలనీకి చేరుకునేది. ఈ సర్వీసును కూడా ఆర్‌యూబీ పనుల్లో భాగంగా నిలిపివేశారు. దీంతో మంగళగిరి ఎయిమ్స్‌కు వెళ్లేందుకు ఈ ప్రాంత వాసులు సిటీ బస్సు సర్వీసు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గులాబీతోట, దుర్గాపురం అల్లూరి సీతారామరాజు వంతెన, సాంబమూర్తి రోడ్డు మీదుగా సిటీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇక్కడ నిర్మించిన ఆర్టీసీ బస్టాప్ నిరుపయోగంగా మారింది. అలాగే ఏలూరు రోడ్డు నుంచి బందరు రోడ్డు, ఆటోనగర్‌కు సిటీ బస్సులు ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే సిటీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలో నిరుపయోగంగా మారిన ఆర్టీసీ బస్టాప్

నేనున్నానని..



రిక్షా కార్మికుడు విశాల హృదయాన్ని చాటాడు. సాయం చేసే మనసుంటే చాలని దివ్యాంగుడికి 'బాట' చూపాడు. నగరంలోని వన్‌టౌన్‌లో దివ్యాంగుడైన ఓ యాచకుడు తన చక్రాల పీట రోడ్డుపై ముందుకెళ్లలేని స్థితిలో ఉన్నాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఓ రిక్షా కార్మికుడికి.. రోడ్డుపై వెళ్లలేక నీరసంగా ఉన్న ఆ యాచకుడు కనిపించాడు. అతను వెంటనే స్పందించి తన రిక్షా కింద భాగంలోని ఇనుప కడ్డీని పట్టుకోవాలని ఆ యాచకుడికి సూచించి ముందుకు సాగాడు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

- ఆటోనగర్(విజయవాడతూర్పు)

రక్తదానంపై అవగాహన పెరగాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని లయన్స్ క్లబ్ విజయవాడ ఈస్ట్ అధ్యక్షుడు, డాక్టర్ హనుమయ్య అన్నారు. శ్రీ సంభవనాథ్ రాజేంద్ర సూరిజైన్ శ్వేతాంబర్ ట్రస్ట్, శ్రీ సంభవనాథ్ జైన్ పరిషత్, లయిన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ సంయుక్త ఆధ్వర్యాన పాతబస్తీలోని ఆరాధన భవన్‌లో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హనుమయ్య మాట్లాడుతూ రక్తదానంపై సమాజంలో అనేక అపోహలు ఉన్నాయన్నారు. రక్తం సకాలంలో అందక లక్షలాది మంది మృత్యువాత పడుతున్నారన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. క్లబ్ ప్రముఖులు తేజ్‌రోజా సోలంకి మాట్లాడుతూ 18 నుంచి 60 సంవత్సరాలు వయస్సు కలిగి, 50 కిలోల కన్నా అధికంగా బరువు ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. యువత ప్రతి మూడు మాసాలకొకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రముఖులు రాజేంద్రకుమార్ సోలంకి, సంపత్‌కుమార్, సుజిత్‌కుమార్ సోలంకి, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.